

## ఆ గృహం..! ఓ వ్యవసాయ క్షేత్రం..!!

### ఒకపక్క విధి నిర్వహణ మరోపక్క పెరటి తోటల సాగు

ముంచంగి పుట్టు ఏప్రిల్ 19 మనం న్యూస్: అది తిరుపతిరావు మాష్టారి స్వగృహం.ఆ ఇంటి ఆవరణంతా పచ్చదనంతో నిండి ఆహ్లాదాన్ని పంచుతోంది.వివిధరకాల పూదోటలుతో గుబాలిస్తూ కళకళలాడుతోంది.ఓ వైపు విధి నిర్వహణ తోపాటు ఇంకోవైపు తమ నివాసమైన ఇంటిని చక్కని వ్యవసాయ క్షేత్రం గా మలిచి ఆదర్శం గా నిలుస్తున్న ఈ మాష్టారుది అల్లూరి సీతారామరాజు (పాడేరు) జిల్లా ముంచంగిపుట్టు మండలం పెదగూడ స్వస్థలం. ఉద్యోగం రీత్యా మండల కేంద్రం ముంచంగిపుట్టు లో నివాసం ఉంటున్నారు.ప్రస్తుతం కరిముఖిపుట్టు పాఠశాల లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. స్వతహాగా రైతు కుటుంబం నుంచి వచ్చిన ఈయన తీరిక దొరికినప్పుడల్లా తన సతీమణి తో కలసి పెరటి పనుల్లో నిమగ్నమైవుంటారు.ఇక్కడ లేని మొక్క అంటూ ఉండదు. కోళ్ల పెంపకం నుంచి కూరగాయలు,ఆపై పండ్లు తోటలు దాకా సాగు చేస్తూ వ్యవసాయ అనుబంధ క్షేత్రం గా మార్చారు.మిరప,నాటు టొమాటో(చిరు) (బెజాఫల్), వంగ, కాకర, బెండ, బరబాటి, తోట, పాల, గొడ్డెం రకాలకు చెందిన ఆకుకూరలను పండిస్తున్నారు.ఔషదగుణాలున్న కొర్రలు, యాలికలు, అతిబల, వాము కాటు తోపాటు ఎర్ర జామ, మామిడి,అరటి పండ్ల మొక్కలను పెంచుతున్నారు. క్యాన్సరు, నిద్రలేమికి సంబంధించిన చెర్రీ, బొడ్డ వంటి పండ్ల మొక్కలు సైతం ఈ క్షేత్రం లో సాగవుతుండం గమనార్హం. దొండ, బీర పాదులను వేసారు. గులాబి, మందారం, మల్లె వంటి పూల తోటలుతో ఇల్లు చూడు ముచ్చట గొలుపుతోంది. బిరియాని ఆకు మొక్క తోపాటు, దాల్చిన చెక్క వంటివి ఇక్కడ ప్లాంటేషన్ లో ఉన్నాయి. కోళ్ల పెంపకం కూడా ఈ అనుబంధ సేద్యంలో ఓ భాగమైంది.పుంజు,గుడ్లు పెట్టలు వంటి నాటు కోళ్లను పెంచుతున్నారు. ప్రస్తుతం వేసవి కారణంగా ఎండలు మండిపోతు న్నాయి. స్పింకలర్లు ద్వారా నీటిని పంపింగ్ చేస్తూ మొక్కలను బతికించే ప్రయత్నం చేస్తున్నారు. ఎరువుగా పసువులు గెత్తాన్నే వాడుతున్నారు. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే ఉంది. రసాయినిక ఎరువులను దరిచేరనివ్వరు. ప్రస్తుతం పండుతున్న కూరగాయ లుతో ఇంటి అవసరాలు తీరుతున్నాయని తిరుపతి మాష్టారు ఆనందం గా చెప్పుకొచ్చారు. ఈ మాష్టారు కృషి కి అందరూ ఫిదా అవుతున్నారు. సహచర ఉపాధ్యాయులు నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి

## సింహగిరిపై భక్తులకు జీవీఎంసీ ఏర్పాట్లు సర్వం సిద్ధం

### చందనోత్సవంలో జీవీఎంసీ అధికారులు విధుల నిర్వహణలో జాగ్రత్తలు పాటించండి: జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం ,ఏప్రిల్ 19 (మనం న్యూస్): శ్రీ వరాహ లక్ష్మి నరసింహస్వామి సింహాచలం చందనోత్సవంలో సింహగిరిపై భక్తుల సౌకర్యార్థం జీవీఎంసీ చేస్తున్న ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని , అలాగే జీవీఎంసీ ఉన్నతాధికారులకు , జోనల్ కమిషనర్లకు అధికారులకు ,ఇంజనీర్లకు ,ఉద్యోగులకు కేటాయించిన విధులలో లోపాలు లేకుండా భక్తులకు సేవలందించేలా జాగ్రత్తలను పాటిస్తూ విధులను నిర్వహించాలని ఆదేశించడమైనదని జీవీఎంసీ కమిషనర్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ వివరిస్తూ సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవ కార్యక్రమానికి సోమవారం సింహగిరికి అధిక సంఖ్యలో అప్పన్న స్వామి దర్శనం కొరకు భక్తులు రానున్నందున.., భక్తులకు సేవలు అందించేలా వారి సౌకర్యార్థం 185 స్టాళ్లలో తాగునీరును , సేవలందించేందుకు తగిన సిబ్బందిని, పారిశుద్ధ్య



విధుల కొరకు పారిశుద్ధ్య కార్మికులను, మొబైల్ టాయిలెట్ల నిర్వహణ కొరకు తగినంత నీటి సరఫరాను తదితర సౌకర్యాలు సర్వం సిద్ధం చేశామన్నారు. కేటాయించిన అధికారులకు విధుల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని ఆదేశించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. సింహగిరిపై క్యూ లైన్ లలో, సూచిత ద్వారాలలో అధికారులను, ఉద్యోగులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయడమైనదని , భక్తులకు అందించే సేవలలో లోపాలు లేకుండా సమాచారం నిమిత్తమై వాకీటాకుల ద్వారా నిత్య పర్యవేక్షణ చేసేందుకు అవసరమగు ఏర్పాట్లు చేయడమైనదని కమిషనర్ తెలిపారు.తాగు నీటి సరఫరాకు సంబంధించి భక్తుల కొరకు 6 వేలు బబుల్ వాటర్ క్యాన్లు, 40 వేల 250 ఎం ఎల్ వాటర్ బాటిల్స్, 20 వాటర్ ట్యాంకర్లతో నీటి సరఫరా మొబైల్ టాయిలెట్ల నిర్వహణ కొరకు, 185 తాగునీరు స్టాళ్లు ( కొండపైన 165 కొండ దిగువున 20 స్టాళ్లు), వాటర్ స్టాళ్లలో 19వ తేదీ సాయంత్రం నుండి 21వ తేదీ ఉదయం వరకు 3 షిఫ్టులలో భక్తులకు సేవలందించేందుకు 1060 మంది వర్కర్లను ఏర్పాటు చేశామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా 60 లీటర్ల కెపాసిటీ గల 600 డస్ట్ బిన్ లను, 2 జెసిబిలను, 2 బాబ్ కాట్ లను,8 ట్రిప్పర్లను, 20 కంపాక్టర్ బిన్నులను,8 డంపర్ బిన్ను లను , 1860 మంది పారిశుద్ధ్య కార్మికులను,40 సూపర్వైజర్లను, 67 వార్డు కార్యదర్శిలను, ఏర్పాటు చేయడమైనదని , సింహాచలం దేవస్థానం ఏర్పాటుచేసిన 372 మొబైల్ టాయిలెట్లకు నిర్వహణ బాధ్యతలను జీవీఎంసీ చేపట్టడమైనదని కమిషనర్ తెలిపారు. సింహగిరిపై దర్శనానికి వస్తున్న భక్తులు ప్రసాదం స్వీకరించిన అనంతరం వ్యర్థాలను ఆలయ ప్రదేశాలలో, క్యూ లైన్ లలో ప్లాస్టిక్ వాటర్ బాటళ్లను, క్యారీ బ్యాగులను, ఇతర వ్యర్థాలను బహిరంగంగా పడవేయకుండా సమీపంలో ఉన్న డస్ట్ బిన్లను మాత్రమే ఉపయోగించాలని , త్రాగునీరును వృధా చేయరాదని, జీవీఎంసీ, ఇతర డిపార్ట్మెంట్ అధికారులకు, ఉద్యోగులకు, పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని భక్తులకు, నగర ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## మండలంలో హౌసింగ్ మాయాజాలం,!?

- అధికారులకు... ప్రజాప్రతినిధులకు కాసులు!?
- లబ్ధిదారులకు చుక్కలు!?
- పురాతన ఇళ్లకు సైతం బిల్లు పెట్టేందుకు యత్నాలు!?



అనకాపల్లి/ చీడికాడ ఏప్రిల్ 19 మనం న్యూస్: పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలకు గూడు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే. మండలంలో గల గృహ నిర్మాణ శాఖ అధికారులు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల స్వార్థంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ కాసుల వర్షం కురిపించుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలంలో ఇటీవల కాలంలో ఏ గ్రామంలో చూసిన గృహ నిర్మాణ శాఖ లీలలపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఇల్లు లేని పేద మధ్యతరగతి కుటుంబీకులకు గృహ నిర్మాణాలను చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో మండలంలో అధికారులు ఇల్లు లేని లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నారు. ఇదే తడవుగా ఒక ఇంటికి రెండు బిల్లులు పెట్టేందుకు, గతంలో నిర్మించిన పురాతన ఇళ్లకు సైతం బిల్లులు పెట్టి డబ్బులు ఇచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

వాస్తవంగా ఒక నిర్మాణానికి పునాదులు, లింటిల్ లెవెల్, స్లాబ్ లెవెల్, ఫైనల్ బిల్ అనే విధంగా నాలుగు దపాల్లో జియో టాకింగ్ చేసి బిల్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ నిబంధనలను అటకెక్కించి ఒకేసారి బిల్లు మంజూరు చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.కొత్తగా ఇల్లు కట్టిన వారికి ఒక బిల్లు పెట్టేందుకు సుమారు 30,000, డబల్ బిల్లు పెట్టాలంటే 50,000, వసూలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయని, కొన్ని గ్రామాల్లో ఇప్పటికే వసూళ్లు సైతం చేశారని ఆరోపణలు లేకపోలేదు. కొత్త ఇంటికి 30 వేలలో ఆయా గ్రామాల్లో నేతలకు 10000, అధికారులకు 20,000 చొప్పున వసూలు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. గతంలో మారు పదేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లకు సైతం రంగులు వేయించి బిల్లులు పెట్టేందుకు కూడా జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఇందుకు ఆయా గ్రామాల నేతలు సైతం పూర్తి బాధ్యత తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సామాన్యులు ఇల్లు కట్టుకోవాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వీరికి గూడు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం బిల్లులు ఇవ్వాలని భావిస్తుంటే ప్రభుత్వం ఇచ్చే బిల్లులలో చిలకకొట్టుడు కొట్టేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు చేతులు కలిపి ఈ మాయాజాలానికి తెర లేపారమే విమర్శలు లేకపోలేదు. ఈ హౌసింగ్ మాయాజాలంపై ఉన్నతాధికారులు ఏ విధంగా చర్యలు తీసుకుంటారో లేక మీనా మీసాలు లెక్కిస్తారో వేచి చూడాల్సిందే.

**(దీనిపై పూర్తి వివరాలు రేపటి కథనంలో.)**



## నేడు డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ

విశాఖపట్నం, ఏప్రిల్ 19 మనం న్యూస్ః ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు సోమవారం 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ కార్యక్రమం విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించబడుతుంది. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు 8688400499 ఫోన్ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, సరఫరా పునరుద్ధరణలో ఆలస్యం, ట్రాన్స్ఫర్మర్ మార్పిడి, రూఫ్టాప్ సోలార్ వంటి వివిధ సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకురావచ్చు. ఈ అవకాశాన్ని సంస్థ పరిధిలోని 11 జిల్లాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

## ఒంటరి మహిళకు ఆర్థిక భరోసా

### తక్షణమే ఉపాధి కల్పించిన జిల్లా కలెక్టర్ నిషాంతి. టి.

పాడేరు, మనం న్యూస్ః ఒంటరి మహిళల సంక్షేమం పట్ల జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో ఉందని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి నిరూపించారు. కష్టాల్లో ఉన్న ఒక మహిళ విన్నపాన్ని సానుభూతితో పరిశీలించి, ఆమెకు ఆర్థిక భరోసా కల్పిస్తూ తక్షణ ఉపాధి ఉత్తర్వులను జారీ చేశారు. ముంచంగిపుట్టు మండలం, జర్జుల పంచాయతీకి చెందిన వి. బిమలమ్మ శుక్రవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో జరిగిన గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ నిషాంతి. టి వారిని కలిసి అర్జీని సమర్పించి తన గోడు విన్నవించుకున్నారు. తన భర్త మరణించారని, తీవ్ర పేదరికంలో ఉన్న తనకు జీవనోపాధి కష్టంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని, ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆమె కలెక్టర్ను వేడుకున్నారు.

కలెక్టర్ తక్షణ స్పందించి వి విమలమ్మ పరిస్థితిని చూసి చలించిన కలెక్టర్, ఆమెకు ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించారు. తక్షణమే పంచాయతీ డివిల్పిఓ పిఎస్ కుమార్ ని ఆదేశించి, సంబంధిత అధికారులతో మాట్లాడి, ఆమెకు 'క్లాత్ మిత్ర' గా ఉపాధి కల్పిస్తూ ఉత్తర్వులు



జారీ చేశారు. 'బాధల్లో ఉన్న మహిళలకు అండగా నిలవడం జిల్లా యంత్రాంగం బాధ్యత అని వి. బిమలమ్మ వంటి కష్టాల్లో ఉన్న మహిళలకు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించి, వారి కాళ్ళ మీద వారు నిలబడేలా ప్రోత్సహిస్తాం ఇచ్చారని కలెక్టర్కు వారికి కృతజ్ఞతలు తన విన్నపానికి సానుకూలంగా స్పందించి, వెంటనే ఉపాధి మార్గం చూపినందుకు బిమలమ్మ కలెక్టర్ వారికి కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపింది.

## సన్మార్గంలో జీవించకుంటే చట్టపరమైన కఠిన చర్యలు

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విజయనగరం ఏప్రిల్ 19 మనం న్యూస్ః నేర ప్రవృత్తిని వీడి సన్మార్గంలో జీవించకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విజయనగరం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషను పరిధిలో నివసిస్తున్న రౌడీ షీట్లు ఇతర బ్యాడ్ క్యారక్టరు షీట్లు కలిగిన వ్యక్తులకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశాలతో సంబంధిత పోలీసు అధికారులు జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్లకు పిలిచి, మంచి ప్రవర్తన కొరకు కౌన్సిలింగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, మాట్లాడుతూ - రౌడీ షీట్లు కలిగిన వ్యక్తుల ప్రవర్తన, వారు నిర్వర్తించే పనులు, ప్రస్తుత వారి జీవన విధానం పట్ల నిఘా పెట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. రౌడీ షీటర్లు దురుసుగా ఉంటూ, మళ్ళీ నేరంకు పాల్పడే అవకాశం ఉన్నట్లుగా వారి ప్రవర్తన ఉన్నట్లయితే వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని, వారిని మంచి ప్రవర్తన కొరకు బైండోవరు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. నేర ప్రవృత్తిని విడనాడ కుంటే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలన్నారు.

అదే విధంగా వివిధ చెడు నడత షీట్లు కలిగిన వ్యక్తులను వారు నివాసం ఉంటున్న పరిధిలో పోలీసు స్టేషనుకు పిలిచి, కౌన్సిలింగు నిర్వహించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ముఖ్యంగా వారి జీవనోపాధికి చేస్తున్న వృత్తులు, ఎక్కడ పని చేస్తున్నదన్న విషయాలపై ఆరా తీయాలన్నారు. బిసి షీట్లు కలిగిన వ్యక్తులకు లేటెస్ట్ ఫోటోలు తీసి, హిస్టరీ షీట్లులో పొందుపర్చాలని, వారి వివరాలను, ఫోటోలను సి.సి.టి.ఎన్.ఎస్.లో నిక్షిప్తం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ స్టేషను పరిధిలోని చెడునడత కలిగిన వారిని స్టేషనుకు పిలిచి, వారి నేర ప్రవర్తన, జీవనోపాధి, చేస్తున్న వృత్తులు గురించి ఆరా తీసి, రికార్డుల్లో వివరాలను నమోదు చేసారు.

## సిటీ చాబర్ ప్రయాణం అందరికీ స్పూర్తిదాయకం: ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం

తిరుపతి ఏఫ్రిల్ 19 మనం న్యూస్: సిటీస్ ఛాంబర్ సమాజంలో సేవలు చేసిన వారిని గుర్తించి వారిని ఘనంగా సన్మానించడంలో ముందుంటుందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం తిరుపతిలోని టి.టి.డి మహతి ఆడిటోరియం వేదికగా తిరుపతి సిటీ ఛాంబర్ 29వ వార్షికోత్సవం,ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగాయి.





ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 1997లో ఒక చిన్న సంస్థగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఈ తిరుపతి సిటీ ఛాంబర్, నేడు తన 1250వ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని ఒక అరుదైన మైలురాయిని చేరుకోవడం విశేషం. ఎటువంటి ప్రభుత్వ లేదా బాహ్య ఆర్థిక సహాయం లేకుండా, కేవలం సభ్యుల అంకితభావంతో మూడున్నర లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చిన ఈ సంస్థ ప్రయాణం అందరికీ స్పూర్తిదాయకమని సభలో పాల్గొన్న వక్తలు కొనియాడారు. ముఖ్యంగా వ్యవస్థాపక అధ్యక్షులు అయూబ్ ఖాన్ వ్యవస్థాపక కార్యదర్శి వై. షణ్ముగం యాదవ్ ల నాయకత్వాన్ని ప్రముఖులు అభినందిస్తు, భారత రాష్ట్రపతి నుండి పారిశుధ్య కార్మికుల వరకు ప్రతి ఒక్కరినీ ఒకే వేదికపై గౌరవించే ఉన్నతమైన సంస్కృతిని వీరు నెలకొల్పారని ప్రశంసించారు. అయూబ్ ఖాన్ నిరంతర శ్రమ, షణ్ముగం యాదవ్ దూరదృష్టి వల్లే 29 ఏళ్ల పాటు సేవా కార్యక్రమాలు అవ్యహతంగా సాగాయని వారు పేర్కొన్నారు.సమాజంలో నిజమైన సేవకులను గుర్తించి సత్కరించడం ద్వారా ఈ ఉగాది పండుగకు సిటీ ఛాంబర్ నిండుదనాన్ని తీసుకువచ్చిందని పేర్కొనగా, మాజీ ఎమ్మెల్యేలు ఎ. మోహన్ ,గాంధీ ఈ సంస్థ తిరుపతి నగరానికే గర్వకారణమని కొనియాడారు. మాజీ టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ కూడా ఛాంబర్ సభ్యుల సేవా దృక్పథాన్ని అభినందించారు.

ఈ సందర్భంగా పద్మశ్రీ దళవాయి చలపతి రావుతో పాటు, 70 ఎకరాల అరణ్యాన్ని సృష్టించిన పర్యావరణ పరిరక్షకుడు దుసర్ల సత్య నారాయణ, తోలుబొమ్మలాటలో జాతీయ అవార్డు గ్రహీత ఎస్. చిదంబరరావులను సభ ఘనంగా సత్కరించింది. లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డులను డాక్టర్ పి. రవిరాజు, కె.ఎస్. నంజుండప్ప,కె. గిరిధర కుమార్ అందుకున్నారు. అలాగే 2026 ఏడాదికి గానూ ఉగాది పురస్కార గ్రహీతలుగా జి. భూమినాథన్, డాక్టర్ చందన స్రవంతి పారి, రజిని, వి. రమేష్ బాబు,వి. శ్రీరామ్ యాదవ్, లయన్ వడ్డాది నాగిని, సాయి లక్ష్మిలు గౌరవించబడ్డారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ ప్రొఫెసర్ స్టాన్లీ, డాక్టర్ పి.ఎస్. కరుణానిధి, డాక్టర్ సి. స్వరాజ్య లక్ష్మి, డైరెక్టర్లు డాక్టర్ పి. గోపాల్, డాక్టర్ అలీషా పర్వీన్ తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించగా, దిక్కి డ్యాన్స్ అకాడమీ వారి సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి.

## రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు



- జనాబ్ షేక్ ఖాజా మోహిద్దీన్ చిష్టి

(గుంటూరు, ఏప్రిల్,19,మనం న్యూస్): ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరిన యాత్రికులకు వీడ్కోలు పలకడం చాలా సంతోషంగా ఉంది. ఈ శుభ సందర్భంలో హజ్ యాత్రికులకు అవసరమైన అన్ని సౌకర్యాలను, వసతులను కల్పించినందుకు మరియు ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాయకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

**ముఖ్యంగా సహకరించిన వారికి ధన్యవాదాలు:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, నారా లోకేష్ కి మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి: హజ్ యాత్రికుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, గన్నవరం విమానాశ్రయం వద్ద అత్యుత్తమ వసతి కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. జనాబ్ ౧అ. షరీఫ్ (మైనారిటీ సంక్షేమ సలహాదారులు), జనాబ్ౖా.౯ృ. ఫరూక్ (మైనారిటీ సంక్షేమ శాఖ మాత్యులు): మీ సమక్షం మరియు దిశానిర్దేశం యాత్రికులకు ఎంతో మనోధైర్యాన్ని ఇచ్చింది. జనాబ్ హాజీ షేక్ హసన్ బాషా (ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్) మరియు జనాబ్ షేక్ షిబ్లి (ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్): కార్యక్రమ నిర్వహణలో మీరు పోషించిన పాత్ర అభినందనీయం. గుంటూరు జిల్లాకు చెందిన మరియు ఎమ్మెల్యేలకు, అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర మైనారిటీ నాయకులకు నా ధన్యవాదాలు. పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదర సోదరీమణులందరూ క్షేమంగా వెళ్లి రావాలని, మన రాష్ట్రం మరియు దేశం సుభిక్షంగా ఉండాలని ఆ అల్లాహ్ను ప్రార్థిస్తున్నానని జనాబ్ షేక్ ఖాజా మోహిద్దీన్ చిష్టి మాజీ కార్పొరేటర్, 12వ డివిజన్, గుంటూరు తెలిపారు



## నేడు కలెక్టరేట్‌లో పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్

- అర్జీల సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 11 00 కు కాల్ చేసి తెలుసుకోవాలి
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి (కలెక్టరేట్ ) ఏప్రిల్ 19 మనం న్యూస్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్), రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమాలను నేడు ఏప్రిల్ 20 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల కు కలెక్టరేట్ సమావేశ మందిరంతో పాటు జిల్లా లో అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవాలని అర్జీదారులకు కలెక్టర్ సూచించారు.పి జి ఆర్ ఎస్ కు హాజరు కాని అర్జీదారులు (మీ కోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు

## విశాఖపట్నం సిటీ పోలీస్ సూచనలు సలహాలు..!!

విశాఖపట్నం ఏప్రిల్ 19(మనం న్యూస్): సింహాచలం అప్పన్న స్వామి చందనోత్సవం సందర్భంగా వాహనాల మీద వచ్చే భక్తులకు మరియు ఇతర వాహనదారులకు విశాఖపట్నం నగర పోలీసులు క్రింది విధంగా సూచనలు సలహాలు అందజేశారు. కారు మరియు ద్విచక్ర వాహన పాస్ ఉన్నవారు కొండపై నిర్ణయించిన ప్రదేశాల్లో (అన్నదానం స్టాల్స్ - గజపతి సత్రం, గరుడ జంక్షన్ సమీపం మొదలైనవి) మాత్రమే పార్కింగ్ చేయాలి. 300/- దర్శనం టికెట్ మరియు ఉచిత దర్శనం భక్తులు (శొంఠ్యాం/హనుమంతవాక వైపు) తమ వాహనాలను అడవివరం జంక్షన్ పార్కింగ్ లో ఉంచి, అక్కడి నుండి దేవస్థానం ఉచిత బస్సుల ద్వారా కొండపైకి వెళ్లాలి. 1000/- మరియు 1500/- దర్శనం టికెట్ భక్తులు (సిటీ/హనుమంతవాక వైపు) న్యూ గోశాల వద్ద పార్కింగ్ చేసి, ప్రత్యేక బస్సుల ద్వారా కొండపైకి వెళ్లాలి; దర్శనం తరువాత తిరిగి అదే మార్గంలో రావాలి. 1000/- మరియు 1500/- టికెట్ భక్తులు (గోపాలపట్నం/వేపగుంట వైపు) శ్రీనివాస నగర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పార్కింగ్ లో వాహనాలు ఉంచి, ప్రత్యేక బస్సుల ద్వారా కొండపైకి వెళ్లాలి. 300/- మరియు ఉచిత దర్శనం భక్తులు (గోపాలపట్నం/అనకాపల్లి/ సబ్బవరం/పాడేరు/పెందుర్తి వైపు) సింహపురి కాలనీ, సాయి నగర్, పంతులుగారి తోట, మేకతోట వంటి పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు ఉంచి, ఉచిత బస్సుల ద్వారా కొండపైకి వెళ్లాలి.

హనుమంతవాక వైపు నుండి వచ్చే ద్విచక్ర వాహనాలు బిసి వెల్ఫేర్ స్కూల్ గ్రౌండ్ లో పార్కింగ్ చేసి, అడవివరం వద్ద నుండి బస్సుల్లో ప్రయాణించాలి. గోపాలపట్నం వైపు నుండి వచ్చే ఆటోలు సింహాచలం వరకు అనుమతి లేదు; మేకతోట వద్ద భక్తులను దింపి అక్కడే పార్క్ చేయాలి. భారీ వాహనాలు (లారీలు మొదలైనవి) 19-04-2026 సాయంత్రం 5 గంటల నుండి 21-04-2026 ఉదయం 5 గంటల వరకు శొంఠ్యాం/సింహాచలం వైపు ప్రవేశం లేదు; ఆనందపురం, ఎన్ఏడి , మద్దిలపాలెం వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించాలి. తేదీ 20-04-2026 న ట్రాఫిక్ మార్పులు సింహాచలం మార్గాన్ని తప్పించి ఎన్ఏడి తాటిచెట్లపాలెం, మద్దిలపాలెం మార్గాల ద్వారా ప్రయాణించాలి. కొండపై అనుమతించబడే వాహనాలు కేవలం ఆర్టీసీ బస్సులు, వీఐపీ వాహనాలు, డ్యూటీ వాహనాలు, పాస్ ఉన్న వాహనాలు మాత్రమే. పోలీసు మరియు ప్రభుత్వ సిబ్బంది కూడా కేటాయించిన పార్కింగ్ లో వాహనాలు ఉంచి బస్సుల్లోనే వెళ్లాలి. సామాన్య ప్రజలు మరియు స్థానికులు గమనించాల్సిన అవసరం ఉంది.

ఓల్ గోశాల నుండి అడవివరం వరకు అత్యావసరం అయితే తప్ప ప్రయాణం చేయవద్దు. ట్రాఫిక్ పోలీస్ సూచనలు, పార్కింగ్ బోర్డులు, గూగుల్ కోఆర్డినేట్లు గమనించాలి. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా దర్శనం చేసుకోవాలి. వాహన పాస్ ఉన్న వాహనాలు మాత్రమే న్యూ టోల్ గేట్ నుండి కొండపైకి అనుమతించబడ తాయని విశాఖ సిటీ పోలీసులు పేర్కొన్నారు.

